జోరుగా నారు వ్యాపారం


కూరగాయల నారు మొక్కలు అమ్ముతున్న వ్యాపారి


కూరగాయలు, పూల నారు సాగు చేస్తున్న రైతు

గణపవరం : ఏటా తొలకరి వచ్చిందంటే నారు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లు సాగుతుంది. జూన్ ఆరంభం నుంచి సుమారు నాలుగు నెలల పాటు ఈ నారు వ్యాపారం జోరుగా సాగుతుంది. పలు రకాల కూరగాయల మొక్కలు, పూల మొక్కలు, విత్తనాలను వారపు సంతల్లో అమ్మకాలు చేస్తూ సుమారు 100 మంది వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు. గణపవరం మండలం వల్లూరు, ముగ్గుళ్ల గ్రామాలు ఈ నారు వ్యాపారానికి ప్రసిద్ధి. వేసవి తర్వాత జూన్‌లో వర్షాలు పడటం ఆరంభం కాగానే ప్రజలు నారు మొక్కలు, విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. వంగ, దొండ, టమోటా, పచ్చిమిర్చితో పాటు బంతి, చామంతి, కనకాంబరం, గులాబి వంటి పూల మొక్కల నారు వారపు సంతల్లో దుకాణాలు వేసి అమ్ముతుంటారు. వీటితో పాటు తోటకూర, గోంగూర, కొత్తిమీర, పాలకూర, చిక్కుడు, బీర, బెండ, వంగ, మిర్చి, పొట్ల, ఆనబ, గుమ్మడి, కాకర వంటి పలు రకాల కూరగాయల విత్తనాలు అమ్ముతుంటారు. గతంలో ఎంతో లాభదాయకంగా సాగిన నారు వ్యాపారం కరోనా తర్వాత మందగించింది. కరోనా పేరుతో రెండేళ్ల పాటు నారు వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. తరువాత కొద్ది కొద్దిగా కోలుకుంటూ రెండేళ్లుగా మళ్లీ నారు వ్యాపారం జోరందుకుంది.

వల్లూరు, ముగ్గుళ్ల నారుకు డిమాండ్

గణపవరం మండలం వల్లూరు, ముగ్గుళ్ల గ్రామాల్లో ఉత్పత్తి చేసే నారుకు జిల్లా వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంటుంది. ఈ గ్రామాలకు చెందిన పలువురు రైతులు నాలుగైదు దశాబ్దాల కాలంగా తమ పొలాల వద్ద, పుంత గట్లు, ఖాళీ దిబ్బలు, గ్రామ పంచాయతీ చెరువు గట్ల మీద, ఇతర ఖాళీ స్థలాల్లోనూ పలు రకాల నారు సాగు చేస్తుంటారు. 20 సెంట్ల నారుమడి తయారీ, విత్తనాలు, సస్య రక్షణకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చవుతుంది. మే చివరి వారంలో నారు మడులు వేసి జూన్ నుంచి నారు అమ్మకాలు ప్రారంభిస్తారు. ఇక్కడి వంగ, మిరప, టమాటా నారు మొక్కలు మంచి దిగుబడి ఇస్తాయని నమ్మకం. కొద్ది రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో నారు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

కోతుల బెడదతో తగ్గిన ఆసక్తి

గతంలో కూరగాయలు, పూల మొక్కల పెంపకంపై ప్రజలు ఎంతో ఆసక్తి చూపేవారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్ద కాస్త జాగా ఉంటే రకరకాల కూరగాయల నారు, విత్తనాలు కొనుగోలు చేసి, పెరటిలో పండించే వారు. అయితే గ్రామాల్లో కొన్నేళ్లుగా కోతుల బెడద ఎక్కువైంది. ఏ గ్రామంలో చూసినా కోతులు వందల సంఖ్యలో గుంపులు గుంపులుగా తిరుగుతూ పెరటి మొక్కలను పీకి పందిరేస్తున్నాయి. ఎంతో మక్కువగా పెంచిన మొక్కలు కాసిన కాయలు దక్కకుండా చేస్తున్నాయి. కోతులను బెదిరించే ప్రయత్నం చేస్తే తిరగబడి కరుస్తున్నాయి. దీంతో ప్రజలకు కూరగాయల మొక్కలు పెంచాలన్న ఆసక్తి సన్నగిల్లిపోయింది.

వ్యాపారం అంతంత మాత్రమే



రెండు దశాబ్దాలుగా వారపు సంతల్లో నారు, విత్తనాల వ్యాపారం చేస్తున్నాను. గతంలో ఉన్నంత ఆదరణ ఇప్పుడు కనిపించడం లేదు. విత్తనాలు, స్థలాల లీజు, నారు పెంపక వ్యయం, సస్య రక్షణ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. ఇటీవల కాలంలో ప్రతి గ్రామంలోనూ కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతకు వచ్చిన కూరగాయలను కోతులు పాడు చేయడంతో ప్రజలు కూరగాయల మొక్కల కొనుగోలు తగ్గించి వేశారు. ప్రభుత్వం తమ లాంటి చిరు వ్యాపారులకు సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

– మంగెన రాంబాబు, నారు వ్యాపారి

ఆదరణ తగ్గిపోతుంది



కూరగాయల మొక్కలు, పూల మొక్కల పెంపకం పట్ల ప్రజల్లో ఆసక్తి తగ్గిపోతుంది. ఇళ్ల వద్ద ఖాళీ స్థలాలు లేకపోవడం, స్థలం అందుబాటులో ఉన్నా మొక్కల పెంపకంపై ఆసక్తి తగ్గిపోయింది. ముఖ్యంగా మహిళలు పలు రకాల పూల మొక్కలు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. రైతులు కూడా మొక్కలు, విత్తనాలు తీసుకెళ్లేవారు. కోతుల పుణ్యమా అని పొలాల్లో కూరగాయల మొక్కలు పెంచడం రైతులు ఎప్పుడో మానేశారు. ఇళ్ల వద్ద కూడా ఇదే పరిస్థితి. దీంతో మా వ్యాపారం అంతంత మాత్రంగానే ఉంది.

– బేతు శ్రీనివాసరావు, నారు వ్యాపారి

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో కామిరెడ్డి నాని

దెందులూరు: ఏలూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల శ్రేణులు సంయుక్తంగా నిర్వహించిన యువత పోరు విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని కలిశారు. జక్కంపూడి రాజా, కామిరెడ్డి నానిని వైఎస్ జగన్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

గణపవరం: ఎమర్జెన్సీ చీకటి రోజులు ఒక పీడ కలగా మిగిలిపోయాయని, ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు లాంటిదని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి అన్నారు. బుధవారం కాలేజీలో చరిత్ర, సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో సంవిధాన్ హత్య దివస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఎమర్జెన్సీ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ 1975 నుంచి 1977 వరకూ దేశంలో విధించిన ఎమర్జెన్సీ గురించి, ఆ నాటి సంఘటనల గురించి విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, అధ్యాపకులు భాస్కరరావు, జి.వెంకట్రావు, వెంకట రమణ, అనూరాధ, పర్వీన్ అన్సారీ, రమేష్ బాబు పాల్గొన్నారు.

హిందీ అభ్యాసన పక్షోత్సవ దీక్ష


కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రసాదరావు

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ హైస్కూలులో హిందీ అభ్యాసన పక్షోత్సవ దీక్ష కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు బుధవారం ప్రారంభించారు. హిందీ భాషలో వెనుకబడిన విద్యార్థులు వర్ణమాల గుణింతాలతో ప్రారంభించి, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. మాట్లాడటం, చదవడం నేర్పించడం ద్వారా వారిలో భాషపై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం జులై 7వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. హిందీ అధ్యాపకులు నారాయణ శివ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు


విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తున్న దాతలు

భీమడోలు: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ప్రముఖ న్యాయవాది డాక్టర్ పల్లా త్రినాథరావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు ప్రాథమిక పాఠశాలలో బుధవారం గ్రామానికి చెందిన న్యాయవాది పల్లా త్రినాథరావు, పి.అన్నపూర్ణ దంపతుల ఆర్థిక సాయంతో పాఠశాలలోని 26 మంది బాలబాలికలకు నోట్ పుస్తకాలను అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పెద్దలు షేక్ భాషా, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా శ్రీనివాసరాజు


ఏవో శ్రీనివాసరాజు

దెందులూరు: మండలం వ్యవసాయ శాఖ అధికారిగా ఎల్.శ్రీనివాసరాజు నియమితులై ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం దెందులూరులోని ఆయన వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో శాఖా పరంగా లక్ష్యాల సాధనకు, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి సైంటిస్టులు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వచ్చి సాగులో మెలకువలు, సూచనలు సలహాలు ఇస్తున్నారని శ్రీనివాసరాజు తెలిపారు.

పసికందుతో తల్లి భిక్షాటన

షేర్ హోమ్‌కు తరలించిన అధికారులు


తల్లితో పాటు పిల్లలను హోమ్‌కు తరలించిన అధికారులు

భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు రైల్వే గేటు సమీపంలో 21 రోజుల పాపని ఎత్తుకొని తల్లి భిక్షాటన చేస్తున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న జిల్లా బాలికా సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్–1098 టీం సభ్యులు పాపతో భిక్షాటన చేస్తున్న తల్లిని భీమడోలు సంత మార్కెట్ వద్ద గుర్తించారు. దీంతో తల్లి, మిగతా ఇద్దరు పిల్లలు, భర్తకు కౌన్సెలింగ్ నిర్వహించి వారిని తాత్కాలిక వసతి కోసం కలపర్రులోని షేర్ హోమ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడలోని జగన్నాథపురానికి చెందిన పంతాడి సూరిబాబు, పంతాడి చిన్నారి దంపతులకు ముగ్గురు సంతానం. ప్రస్తుతం వారు భీమడోలులో సంత మార్కెట్ వద్ద నివాసముంటున్నారు. ఆమె తన పాపను ఎత్తుకొని సంత మార్కెట్ వద్ద యాచక వృత్తిని సాగిస్తోంది. సమాచారం అందుకున్న భీమడోలు ఐసీడీఎస్ పీవో సునీల్ రాజశేఖర్, సచివాలయ మహిళా కానిస్టేబుల్ దుర్గ, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఆమెను గుర్తించారు. తల్లిదండ్రులు, వారి ముగ్గురు పిల్లలను ఏలూరులోని జిల్లా బాలికా సంరక్షణా కార్యాలయానికి తరలించారు. డీసీపీవో సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పేదరికం వల్ల పోషించలేక, కుటుంబ పోషణ భారమైనందున పాపను పట్టుకొని భిక్షాటన చేస్తున్నానని అధికారులకు తెలిపింది.

వరిలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి


భీమడోలు: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త


దెందులూరు: రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరాజు

భీమడోలు: వరి సాగులో రైతులు విచక్షణారహితంగా ఎరువులు, పురుగుమందులు వాడొద్దని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం అంబర్‌పేట, పూళ్ల గ్రామాల్లో రైతులతో కలిసి వ్యవసాయాధికారుల బృందం క్షేత్ర పర్యటన చేశారు. సార్వాలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వరి వంగడాలపై కలుపు యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఏవో ఎస్పీవీ ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా డీఆర్‌సీ ఏడీఏ లలితా సుధా, సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్, భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి పాల్గొని రైతులకు పలు సూచనలందించారు. భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి మాట్లాడుతూ రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించే దిశగా సాగు చేయాలన్నారు. ఏవో ఎస్పీవీ ఉషారాణి మాట్లాడుతూ మండల పరిధిలో 366 ఎకరాల్లో నారుమడులు, 66 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మ నాయుడు, వీఏఏ, ఏహెచ్‌ఏ పాల్గొన్నారు.

నీటి ఇంజన్లు ఇవ్వాలి

దెందులూరు: జింకు బోరాన్ నీరు తోడుకోవడానికి ఇంజన్లు ఇవ్వాలని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. బుధవారం దెందులూరు మండల వ్యవసాయశాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మేదినరావుపాలెం, జోగన్నపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో రైతులు వ్యవసాయ సాగులో భాగంగా నీళ్లు తోడుకోవడానికి ఇంజన్లు త్వరగా ఇవ్వాలన్నారు. అనంతరం రైతుసేవా కేంద్రాల్లో రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

నేటి నుంచి వృద్ధులకు ఇంటి వద్దే రేషన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

భీమడోలు: వృద్ధులు, దివ్యాంగులు, మంచం పట్టిన రోగులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించాల్సిన బాధ్యత డీలర్లు, వీఆర్వోలదేనని తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం రేషన్ డీలర్లు, వీఆర్వోలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎస్ డీటీ భరత్‌కుమార్ అధ్యక్షత వహించారు. తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవిలు మాట్లాడుతూ 65 ఏళ్ల నిండిన వృద్ధులు, దివ్యాంగులు, మంచం పట్టిన రోగులకు జులై రేషన్‌ను ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో డీలర్లు ఇంటింటికీ వెళ్లి వారికి అందించాలని, అశ్రద్ధ వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జులై ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్‌ను కార్డుదారులకు అందించాలని, డీలర్లు తమ దుకాణాల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్ర 4 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్డుదారులకు రేషన్ సరుకులను అందించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలి

దెందులూరు: జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు 65 సంవత్సరాలు పైబడిన వారికి నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు రేషన్ సరుకులు ఇంటి వద్ద పంపిణీ చేస్తామని తహసీల్దార్ సుమతి అన్నారు. బుధవారం ఆమె డీలర్లతో మాట్లాడుతూ వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ పంపిణీ చేయాలన్నారు. దెందులూరు మండలంలో అన్ని గ్రామాల్లో కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీలర్లు అందరూ విధిగా ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయాలని తహసీల్దార్ సూచించారు.

డంపింగ్ యార్డుతో భక్తులకు ఇబ్బందులు


మాట్లాడుతున్న ప్రధానార్చకులు రవితేజశర్మ, ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: డంపింగ్ యార్డు, సరైన రహదారి సౌకర్యం లేక బైనేరు ఉమా సహిత రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆలయ ప్రధానార్చకులు మేడూరి వెంకట రమాసుబ్రహ్మణ్య రవితేజ శర్మ తెలిపారు. జంగారెడ్డిగూడెం బైనేరు శివాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆలయానికి ఉత్తరాన ఉన్న డంపింగ్ యార్డు వల్ల మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఆరు నెలల క్రితం చెత్త రీసైక్లింగ్ కోసం యంత్రాన్ని ఏర్పాటు చేశారని, నాటి నుంచి ఆలయానికి వచ్చే భక్తులకు రహదారి సౌకర్యం సరిగా లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆలయానికి దక్షిణం వైపు ఉన్న మట్టి రోడ్డుపై గోతులు ఏర్పడి వర్షాకాలం కావడంతో బురదమయంగా మారి భక్తులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. టైర్ల ఫ్యాక్టరీ ఏర్పాటుతో కాలుష్యం పెరిగిపోయిందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, డంపింగ్ యార్డుతో పాటు రహదారి సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు.

నూతన కమిటీ ఏర్పాటు

ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రవితేజశర్మ తెలిపారు. అధ్యక్షుడిగా ఊడా రాంగోపాల్, ఉపాధ్యక్షుడిగా పెందుర్తి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కాటేపల్లి రుద్రేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా మేకా సింహాద్రి, సభ్యులుగా పరసా రాంబాబు, కొల్లేపర రజనీకాంత్, కొల్లేపర రాధాకృష్ణ, సోమగాని చంద్రకళ, బచ్చు రామ్మోహన్‌రావులను ఎన్నుకున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా శిఖర నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామని, భక్తులు గమనించాలని కోరారు. దాతలు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.

ఆసుపత్రి ఎదుట రిలే దీక్ష ప్రారంభం


హాస్పిటల్ ఎదుట దీక్ష చేస్తున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా హాస్పిటల్ సానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. గత కొన్ని రోజులుగా హాస్పిటల్ ఎదుట ధర్నా చేస్తున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ నుంచి కనీస స్పందన లేకపోవడంతో రిలే దీక్షకు పూనుకున్నామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు తెలిపారు. దీక్ష శిబిరాన్ని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణ రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు ప్రారంభించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్, నాయకులు వేముల రాజు, సంజీవ్, మేరీ, చంద్రకళ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కొయ్యలగూడెం: కాలనీవాసుల సమస్యల (జగనన్న కాలనీ) పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. పరింపూడి గ్రామ పంచాయతీ, రెవెన్యూ పరిధిలో గల చేపల వారి వీధి శివారున వైఎస్సార్ సీపీ హయాంలో 188 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శి సురేష్, ఈవోపీఆర్డీ సతీష్‌లతో కలిసి బుధవారం పరిశీలించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూర్య, సచివాలయ సిబ్బంది, ఉన్నారు.

రైతులు నారుమడులు సిద్ధం చేసుకోవాలి


గణపవరం: రైతులకు సూచనలిస్తున్న ఏవో ప్రసాద్


పెదపాడు: కొక్కిరపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

గణపవరం: రైతులు ఖరీఫ్ నారుమడులకు సిద్ధం కావాలని, నాణ్యమైన వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని గణపవరం మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని సరిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. సార్వా సీజన్ ఆరంభమైనందున రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. విత్తన శుద్ధి చేసిన తరువాతే విత్తనాలు వేయాలని, అధిక వర్షాలకు పైరు పడిపోకుండా ఉండే రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా కౌలు రైతు కార్డులు పొందాలని, తద్వారా ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రయోజనాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలి

పెదపాడు: మండలంలోని రైతులు నారుమడులు పోసే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్‌ఇమామ్‌ఖాసిం తెలిపారు. మండలంలోని అప్పనవీడు, కొక్కిరపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. విత్తనాలకు లీటరు నీటికి ఒక గ్రామ్ కార్బన్‌డిజమ్ కలిపి విత్తన శుద్ధి చేసిన తరువాత నారు మడులు పోసుకోవాలని సూచించారు. నారుమడుల్లో జింకు లోపం కనిపిస్తే రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను ఒకలీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గారపాటి శ్రీనుబాబు, వేములపల్లి రామకృష్ణ, బెక్కం శ్రీనివాసరావు వడ్డివాసవి, గరికపాటి చంటి పావులూరి రామారావు గ్రామ వ్యవసాయ సహాయకులు రేవతి, సత్యనారాయణ, దీపిక పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన


రహదారి పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు

పెదపాడు: మండలంలోని పెదపాడు వడ్డిగూడెం రహదారి పనులను ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం పరిశీలించారు. ఇటీవల వడ్డిగూడెం రహదారి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రహదారి నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వడ్డిగూడెం గ్రామానికి వెళ్లే రహదారి అభివృద్ధికి నోచుకోలేదని, ఇప్పుడు రహదారి నిర్మాణం పూర్తి అయిందని దీంతో గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

ఉంగుటూరులో జోరు వాన

ఉంగుటూరు: ఉంగుటూరులో బుధవారం జోరువాన కురిసింది. దీంతో ప్రజలు దైనందిన పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. బయటకు వెళ్లడానికి పలు అవస్థలు పడ్డారు. ఈ వర్షం రైతులకు ఉపయోగంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. సార్వా పనులు ముమ్మరంగా చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. నారాయణపురం వంతెన పడిపోవడంతో రాకపోకలు పుంత రహదారుల మీదుగా కొనసాగించడంతో ప్రయాణం నరకంగా మారింది. నారాయణపురం–తల్లాపురం పుంతరోడ్డు, ఉంగుటూరు–నారాయణపురం పుంత రహదారి నరకంగా మారాయి. వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ముఖ ఆధారిత గుర్తింపు తప్పనిసరి

అంగన్‌వాడీలు జవాబుదారీగా పని చేయాలి


చిన్నారుల ముఖ ఆధారిత గుర్తింపు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

దెందులూరు: దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీ సేవల్లో సమూల మార్పులకు కేంద్ర శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ శ్రీకారం చుట్టింది. జూలై 1వ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ ఆధారిత గుర్తింపు ఆచరణలోకి తీసుకురానుంది. కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేసే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా పారదర్శకతకు పెద్దపీట వేసేలా కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారులకు పంపిణీ చేసేటప్పుడు ఆహార పంపిణీ విషయంలో ఒక గుర్తింపు తప్పనిసరి కానుంది. ఓషన్ ట్రాకర్ యాప్ ద్వారా ప్రాజెక్టుల కార్యాలయాల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జులై 1 నుంచి అమలు చేయనున్నారు. ఇప్పటికే కేంద్రాలకు పంపిణీ చేసే కోడిగుడ్డుపైనే వారానికి ఒక ముద్రతో సరఫరా చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆ రెండు యాప్‌లలోనే ప్రస్తుతం బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు మూడేళ్ల లోపు చిన్నారుల ముఖ గుర్తింపు నమోదు చేస్తున్నారు. తొలుత కేంద్ర పర్యవేక్షణలోని పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేసి బాల సంజీవని యాప్‌లో ఫొటోతో సహా నమోదు ఉండడంతో క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావించారు. సర్వర్లు మొరాయించడంతో పాత విధానంలో వేయాల్సి వచ్చింది. ఇప్పుడు తాజాగా ముఖ గుర్తింపు విధానానికి కేంద్ర ప్రభుత్వం నాంది పలికింది. సరుకుల పంపిణీ ఇకపై అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే చేరతాయి.

దెందులూరు నియోజకవర్గ వివరాలు

మండలాలు	3
అంగన్‌వాడీ సెంటర్లు	241
గర్భిణులు	917
బాలింతలు	804
మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు	5012

పారదర్శకతతోనే అభివృద్ధి



ఏ పథకమైనా పారదర్శకతతోనే లక్ష్యాలను సాధించొచ్చు. జవాబుదారీతనం ఉంటే పథకం ఫలితాలు అర్హులైన లబ్ధిదారులకు క్షేత్ర స్థాయిలో అందుతాయి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం ఫలితాలు వస్తాయి. ఈ పథకం అమలుపై నిరంతరం పూర్తి స్థాయి పర్యవేక్షణ చేయాలి.

– కోటే నాగమల్లేశ్వరి, సర్పంచ్, గోపన్నపాలెం

కేంద్రాల వద్ద స్టాకు వివరాల బోర్డులు పెట్టాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పౌష్టికాహారం స్టాకు వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. సరుకు పంపిణీ, నిల్వ, లబ్ధిదారుల వివరాలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ప్రదర్శించాలి. నిరంతర సమీక్ష, తనిఖీలు చేయాలి. అంగన్‌వాడీలు బాధ్యతగా లబ్ధిదారులకు సరుకులను అందించాలి.

– నవ్య, సర్పంచ్, జాలిపూడి